
# సమస్య

పెళ్లకూరు జయప్రద



"రాధా! పిల్లలకు ఎంత అడిగితే అంత ఇచ్చి నువ్వు చెడిపేస్తున్నావనిపిస్తుందిరా."

నవ్వేసాడు రాధాకృష్ణ. రమణకు అలా అనడం అలవాటే రాధాకృష్ణకు అలా నవ్వడం అలవాటే.

"అలా నవ్వి కొట్టిపారేయకు. ఇది వాళ్ళ భవిష్యత్తుకు సంబంధించిన విషయం."

"భవిష్యత్తా?" మరలా నవ్వబోయి ఆగాడు రాధాకృష్ణ.

"రమణా! నాకు బొత్తిగా నమ్మకం లేదు మన పిల్లల భవిష్యత్తును మనం నిర్మించగలమని."

"ఊహుఁ నీ అభిప్రాయం నాకు నచ్చలేదు. మన పిల్లల్ని మనం కని పారేయడంతోనే మన బాధ్యత తీరిపోలేదు. మన ఆనందం కొరకే మన పిల్లలు అనుకుంటే అంతకంటే అన్యాయపు టాలోచన మరొకటుండదు" తీవ్రంగా అన్నాడు రమణ. అతని కంఠంలోని తీవ్రత అతని వేళ్ళ కొసలతో ఇసుకలో అతను గీస్తున్న గీతల్లో రిఫ్లెక్ట్ అవుతోంది. ఆ తడి ఇసుకలో అతను అసంకల్పితంగా గీస్తున్న గీతలు చాలా లోతుగా వున్నాయి.

స్నేహితుని ఆవేశానికి చిరునవ్వు నవ్వాడు రాధాకృష్ణ.

"రమణా! నేను బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నట్టు కనిపిస్తుందా?"

మౌనంగా ఔనన్నట్టు చూసాడతను.

"పిల్లలు మన ఆనందానికే- నిజం- కానీ వాళ్ళు చెడిపోవాలని మనం కోరుకోం. వాళ్ళు బాగుపడి మనల్నేదో

ఉద్ధరించాలని కాకపోయినా ప్రకృతి సిద్ధంగా మనలో వుండే మమకారాలు వాళ్ళు బాగుపడాలనే కోరుకుంటాయి కానీ రమణా చెప్పాగా నాకు నమ్మకం లేదు, మనం వాళ్ళని బాగుపరగలమని" అంటూ లేచి నిల్చొని తన ప్యాంటు కంటుకున్న ఇసుక దులుపుకున్నాడు రాధాకృష్ణ.

"నీకీ టాపిక్ ఇష్టమున్నట్టు లేదు. ఓ.కె. పోనీ కాస్సేపు కూర్చో నాకప్పుడే ఇంటికెళ్ళాలని లేదు"

"తప్పదు రమణా, ఇప్పుడు కాకపోతే మరో అరగంట తర్వాతనైనా ఇంటికెళ్ళాల్సిందే మన కిష్టంలేని బరువుల్నుంచి ఓ అరగంటసేపు ఎస్కేప్ కాగలమంతే కదూ!" అంటూ ఓదార్చున్నాడు రాధాకృష్ణ.

"నీకేమయ్యా ఎన్ని కబుర్లయినా చెప్తావ్. లీడింగ్ లాయర్‌వు. రెండు చేతులా సంపాయిస్తున్నావు. మాలాటి వాళ్ళకు ఇంటికెళ్ళాలంటే ఎప్పటికీ భర్తీకాని లోట్లే కనిపిస్తూ వుంటాయి."

"ఒకరకంగా నిజమే నువ్వుచెప్పింది. కానీ— భర్తీకాని లోట్లు మా జీవితాల్లోను వుంటాయి. కాకపోతే అవి ఆర్థికమైనవి కాకపోవచ్చు".

అలా అంటున్నప్పుడు కృష్ణమూర్తికి వేదవతి గుర్తుకొచ్చింది. గతించిపోయిన అతని ఇల్లాలు వేదవతి— ఈ జీవితంలోకల్లా ఆ లోటును ఏవరైనా భర్తీ చేయగలరా? తనకు మరో భార్య రావొచ్చు కానీ వేదవతి రాదు. అది కఠినమైన నిజం.

"రాధా?" ఆర్ద్రంగా పిలిచాడు రమణ. అతనికి తెలుసు స్నేహితుడి గుండెల్లో వేదన.

"ఇలా నువ్వొంటరివోవడం నాకు నచ్చలేదురా" జవాబు చెప్పలేదు రాధాకృష్ణ.

"నీ కొరకు కాకపోయినా పిల్లల కొరకు చెప్తున్నాను. వాళ్ళు చెడిపోతున్నారు."

రాధాకృష్ణ ఆరిపోయిన పెదాలమీద చిరునవ్వు మెదిలింది.

"రమణా" ఒకవేళ నేను పెళ్ళిచేసుకుంటే అది నా కొరకే గాని పిల్లల కొరకు కాదు పిల్లలకు మరో జీవితం ముందుంది కానీ నాకు రెండో భార్యగా వచ్చే అమ్మాయికి నాతోడే జీవితం. నా పిల్లల తోటి కాదు. ఏమంటావ్"

రమణ స్నేహితుడు చెప్పిన సత్యాన్ని జీర్ణించుకుంటూ అన్నాడు.

"అన్నీ డీప్‌గా ఆలోచిస్తావు నువ్వు ఒక్క పిల్లల విషయంలో తప్ప."

"పిల్లల విషయంలో నేను ఆలోచించడంలేదా?" అంటూ ఆలోచనలో పడిపోయాడు రాధాకృష్ణ.

చాలసేపటి వరకు డిస్టర్బ్ చేయలేదు రమణ.

"బాగా చీకటిపడింది వెళ్దామా? రోడ్డుకూడా బాగాలేదు."

మౌనంగా లేచి విల్చున్నాడు రాధాకృష్ణ. అతనింకా ఆలోచిస్తున్నాడు. "నేను పిల్లల విషయం పట్టించుకోవడం లేదా?" ఇసుక దాటి, సరుగుడు చెట్లు దాటి, గవర్నమెంటు రెస్ట్‌హౌస్ దాటి, వంతెనదాటి మైపాటు రోడ్డుమీద పడ్డాక కూడా అతనికి ఆలోచన తెగలేదు. ఇంకా పిల్లల గురించి ఎలా పట్టించుకోవాలో అతనికి బోధపడలేదు.

రమణ స్కూటర్ స్టార్ట్‌చేసిన శబ్దానికి తన ఆలోచనా సరాల్ని తెంపుకొనొచ్చి స్కూటర్ వెనుక కూర్చున్నాడు రాధాకృష్ణ.

* * *

"ఎందుకని అడక్కుండానే పది రూపాయలిస్తున్నావు హేమంత్‌కి"?

రాధాకృష్ణ ఆఫీస్‌రూమ్‌లో క్లయింట్‌తో వున్నాడనే విషయాన్ని కూడా విస్మరించి విస్మయంగా చూసాడు రమణ.

'మరలా రేపు కలుస్తానని' క్లయింట్ లేచి వెళ్ళిపోయాక కుర్చీలో రిలాక్స్ అవుతూ అన్నాడు రాధాకృష్ణ.

"ఎందుకని అడిగితే నాకు అబద్ధం చెప్తాడని నా భయం."

"ఎందుకని అడిగి పూర్కోవడం కాదు. అంత చిన్న వయసులో వాడి ఖర్చులను మనం కట్ చేయాలి. లేకపోతే అలా లావిష్‌గా ఖర్చుచేయడానికి అలవాటు పడ్తాడు. డబ్బు విలువ తెలిసి పెరగాలిరా పిల్లలు."

"ఖర్చు చేస్తేనే వాళ్ళకు డబ్బు విలువ తెలుస్తుందని నా ఊహ."

"నీ ఊహల్నీ, నీ అభిప్రాయాల్నీ వాళ్ళమీద రుద్ది వాళ్ళను పాడుచేస్తున్నావు."

రాధాకృష్ణ మరలా ఆలోచనల్లోకి జారిపోయాడు.

'నేను నా పిల్లల్ని చెడపేస్తున్నానా?'

"రాఘవేడీ?" మరలా రమణే అడిగాడు.

"పిక్చర్ కెళ్ళాడు."

"ఎవరితో?"

"వాళ్ళ క్లాస్ పిల్లల్తో."

వాళ్ళ క్లాస్‌పిల్లల్తోనా?" విస్తుపోతూ చూసాడు రమణ.

అవునన్నట్లు తల వూపాడు రాధాకృష్ణ.


"నాలుగో క్లాసు పిల్లాడు వాళ్ళ క్లాసు పిల్లల్తో సినిమా కెళ్ళేంత పెద్దవాడా?" తన స్నేహితుని తాలూకు ప్రతి చర్యా అతనికి ఆశ్చర్యంగానే వుంటుంది.

"పిల్లలకు మనం కొంత స్వేచ్ఛ నివ్వాలి రమణా."

నిదానంగానే అయినా స్థిరంగానే అన్నాడు రాధాకృష్ణ.

"పిల్లలకు స్వేచ్ఛనివ్వాలా?" కొత్త థియరీని జీర్ణించుకోడానికి ప్రయత్నిస్తున్నాడు రమణ.

"రావోయ్ రా. పెద్దాడివయిపోయావే చాల నెలలయింది చూసి" తన స్నేహి




తుకు ఆహ్వానిస్తున్న క్రొత్త అతిథిని చూచి నివ్వెరపోయాడు రమణ. వాడు తన పెద్ద కొడుకు.

"నువ్వు ఒక్కడివే వచ్చావా?" ఆత్రుతగా అడిగాడు.

రమణ ఇంటికి రాధాకృష్ణ ఇంటికి ఇంచుమించు రెండు కిలోమీటర్ల దూరముంటుంది. రమణ కొడుకు మాధవ్ రావు వయసు పది.

"తమ్ముడు కూడా వచ్చాడు నాన్నా నాతో."

"తమ్ముడా నీకు తోడు?" కోపంగా చూసాడు రమణ.

ధైర్యంతెచ్చుకుని లోపలికి రాబోతున్న రమణ ఎనిమిదేళ్ళ రెండో కొడుకు రాజేష్ తండ్రికోపానికి గడప దగ్గరే ఆగిపోయాడు.

"అసలెందుకొచ్చావ్?"

వాడు అసలు విషయం చెప్పడానికి అరగంటపైన పట్టింది.

"పిక్నిక్ ఏపూరికోయ్" వాడి అవస్థ చూసి రాధాకృష్ణకు జాలేసింది.

"ముత్తుకూరుకటండీ"

"ముత్తుకూరా! చాల బాగుంటుంది. స్టీమ్‌బోట్ మీద అలల్లో వెళ్ళడం చాలా థ్రిల్లింగ్‌గా వుంటుంది."

స్నేహితుడి పరవశానికి రమణకు ఒళ్ళు మండింది.

"ముత్తుకూరుకు ఇద్దరు పిల్లలకు పదిరూపాయలా?"

"పదిరూపాయలు కాదు నాన్నా చెరి మూడు రూపాయలు మాష్టారుకి కట్టాలి. మరి నాలుగు రూపాయలు...." నసిగాడు మాధవ్.



"ఊఁ నాలుగు రూపాయలేం చేస్తావు?"

"చాక్లెట్లు కొనుక్కుంటాము అందరూ మనిషికి ఐదురూపాయలు తెచ్చుకుంటున్నారు." మొదట చాల బెరుగ్గా చెప్పి ఆఖరివాఖ్యం వేగంగా చెప్పి ముగించాడు మాధవ్.

"నాలుగు రూపాయలకు చాక్లెట్లా? ఒక్క చాక్లెట్ ఎంత?"

"పదిపైసలు" ఠకీమని జవాబిచ్చాడు వాడు.

"చాక్లెట్ పదిపైసలయితే నాలుగు రూపాయల కెన్ని చాక్లెట్లు వస్తాయి?"

రాధాకృష్ణకు వాడిని చూస్తే జాలి పెరిగిపోతోంది.

స్నేహితుడు టీచర్‌లా కుర్చీలో కూర్చొని గదమాయిస్తున్నాడు. అ స్నేహితుడి కొడుకు చేతులు కట్టుకొని తండ్రివేసిన లెఖ్ఖచేయడానికి తంటాలు పడ్తున్నాడు. భయానికి సగం అతనికా లెఖ్ఖ తేలడంలేదు.

ఆఖరకు చెరి రెండు చాక్లెట్లకు సాంక్షన్‌చేసి ఆరు రూపాయలు తను స్వయంగా వెళ్ళి టీచర్‌కు కట్తాననిచెప్పి, వాళ్ళిద్దరూ అలా ఎక్కడకీ మరెప్పుడూ రాకూడదని హెచ్చరించి లేచి వాళ్ళతో

రమణ బయటకు నడిచాక చాలా సేపటి దాకా రాధాకృష్ణ ఆత్మపరిశీలన చేసుకుంటూనే వున్నాడు. 'తను పిల్లలని చెడిపేస్తున్నాడా ?'

* * *

తన క్లయింట్ పనిమీద హైదరాబాద్ వెళ్తున్న రాధాకృష్ణ ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంటు బర్త్‌మీద ఒంటరిగా కూర్చొని ఆలోచిస్తున్నాడు.

'హేమంత్ ఎందుకిలా తయారయ్యాడు!'

ఇప్పుడేకాదు ఎప్పుడు కాస్త తీరిక దొరికినా తన పాతికేళ్ళ మొదటి కొడుకు గురించి ఆలోచిస్తూనే వున్నాడు. తల బద్దలు కొట్టుకుంటూనే వున్నాడు.

తనలాగే అడ్వకేట్‌ని చేసాడు హేమంత్, రాఘవ్‌లిద్దరినీ. నిజానికి వాళ్ళల్లో ఒకర్ని డాక్టర్ని, మరొకర్ని ఆడిటర్ని చేయాలనుకున్నాడు కానీ ఇద్దరూ చదువులో అంత తెలివిగల వాళ్ళు కాకపోవడంతో ఇంటర్ తర్వాత బి.ఎ. బిఎ తర్వాత బియల్ చేయించక తప్పలేదు. ఇద్దరికీ తనంత ప్రాక్టీస్ లేదు. ప్రాక్టీస్ లేకపోయినా సంపాదన, సంపాదన లేకపోయినా ఫర్వాలేదు. తను ఖర్చుచేయగా మిగిలిందే ఇంకా చాలా వుంది. కానీ హేమంత్ ఈ రకపు ప్రవర్తనే తనని మానసిక వ్యాధిగ్రస్థుణ్ని చేస్తోంది.

హేమంత్ ప్రవర్తన గుర్తువచ్చినప్పుడల్లా రాధాకృష్ణకు గిల్టీగా వుంటుంది. ఆ గిల్టీ ఫీలింగ్ వెనక రమణ గుర్తుకొస్తాడు. ఇంచుమించు పదిహేనేళ్ళ తర్వాత కూడా.

"రాధా ! నీ పద్ధతేం బాగలేదు. నీకు డబ్బుండొచ్చు కానీ వాళ్ళను డబ్బులో పెంచి చెడిపేస్తున్నావు" అనే రమణ మాటలే స్పష్టంగ వినిపిస్తుంటాయి.

"నేను సర్వస్వేచ్ఛా ఇచ్చి నా కొడుకును చెడిపేసుకున్నాను" అనే ఆత్మ నింద అతన్ని వదలడంలేదు. పైగా పెళ్ళొకటిచేసి ఆ పిల్లనీ అన్యాయం చేసాడు తను.

"ఎందుకిలా తయారయ్యాడు హేమంత్ ?"

డబ్బువల్ల వచ్చే సుఖాలన్నీ తనూ కొనుక్కున్నాడు. ఏ వస్తువు కావాలనుకుంటే అది ఇంటికి తెచ్చుకున్నాడు. ప్రతి సినిమా తప్పనిసరిగా చూసాడు. కోర్టు హాలిడేస్‌లో ఒక్కొక్కసారి ఒక్కొక్క దేశం చొప్పున ఇంచుమించు ప్రపంచం అంతా తిరిగాడు కానీ హేమంత్‌లా తనెప్పుడూ బాధ్యతను విస్మరించలేదు. ఇంట్లో ఎవరినీ బాధపెట్టలేదు.

"హేమంత్‌లో ఎలా వచ్చింది ఇంతటి విశృంఖలత. భార్యమనసు నొప్పించి తను మాత్రమే సుఖం కొనుక్కునే తత్వం ఎలా వచ్చింది? దానివల్ల అతనికి లభించేదేముంది ? ఒక బాధ్యతాయుత మైన ప్రొఫెషన్‌లోవుంటూ హఠాత్తుగా

ఎందుకిలా ఇంట్లోనుండి మాయమవు తుంటాడు?"

హేమంత్ తనకు కనపడి ఇప్పటికి పదిరోజులు. కోడలి చూపులను తను తట్టుకోలేకుండా వున్నాడు.

'మీరే వారిని చెడిపేసింది' అన్నట్టు ఉంటుందా చూపు–ఆ అమ్మాయి నోరు తెరిచి ఏమీ అనదుకానీ ఆ పిల్ల గుండెల్లో అసంతృప్తిని తను గ్రహించగలడు.

"నిజమే అతిస్వేచ్ఛ ఇచ్చి డబ్బంటే ఏమిటో తెలియని వయసులో డబ్బులో ముంచి హేమంత్‌ని నేనే చెడిపేసాను." అని విపరీతంగా బాధపడే సమయాల్లో రాఘవ అతనికి చిన్న స్వాంతన.

రాఘవనికూడా తనే పెంచాడు. డబ్బు లోనే పెంచాడు, స్వేచ్ఛనిచ్చే పెంచాడు కానీ రాఘవలో జీవితాన్ని ఎంత త్వరలో ఎంత అనుభవించగలిగితే అంత అనుభ వించాలనే ఆరాటం లేదు. తండ్రిలా ముందు కెళ్ళాలని తన ప్రొఫెషన్‌లో తను షైన్‌కావాలనే కోరిక గాఢంగా వుంది. డబ్బిచ్చే సుఖాలను చిన్నప్పటి నుండీ అనుభవించిన అతనికి, ఇంకా అనుభవిస్తున్న అతనికి అందులో నిషా కన్పించలేదు.

ఆలోచించి ఆలోచించి అలసిపోయిన అతనికి కనురెప్పలమీదుగా నిద్ర పరచు కున్నట్టయి మెత్తటి బర్త్‌మీద వాలాడు. అలా వాలిన కొన్ని సెకన్ల తర్వాత అది నిద్రకాదని అలసట అని తెలియడానికి అతనికెంతోసేపు పట్టలేదు. మరల లేచి బ్యాగ్‌లోనుండి కాంపోజ్‌మాత్ర వేసుకుని పడుకున్నాడు రాధాకృష్ణ.

అతను నిద్రలేచేసరికి బాగా తెల్లారి పోయింది. బాగా లేట్‌గా రన్‌అవుతు న్నట్టుంది ట్రెయిన్. ఏదయినా ఇంకా ఆలేరు స్టేషన్‌లోనేవుంది. లేచి తల్పుని బయటకు చూసాడు.

"కాఫీసార్!" చాలా ఉత్సాహంగా పరిగెట్టుకుంటూ వచ్చాడు పదిహేడేళ్ళ అబ్బాయి.

"వద్దు" పంపించేసాడు.

కొద్దిదూరంలో మంచినీళ్ళు సప్లై చేస్తున్న వో వృద్ధుడు. అతని పెదాల మీద చెరగని చిరునవ్వు. వచ్చిన వాళ్ళతో జోక్సుచేస్తూ వాళ్ళ సహాధారా లడుగుతూ చాల హాయిగా నవ్వుతున్నాడు.

'హేమంత్‌లాటి కొడుకు లేడేమో ఇతనికి' నిట్టూర్చాడు రాధాకృష్ణ.

అతనికి లేవాలనిలేదు. కనీసం పళ్ళు తోముకునే శక్తికూడా లేదు. అతని గిల్టీ ఫీలింగ్ అతనిని కృంగదీస్తోంది. వర్క్‌లో వున్నపుడు అన్నీ మర్చిపోయి కాస్త బాగుంటాడు. ఇక ఇలా విశ్రాంతి దొరికినపుడే అది అతనిని కొరికేస్తుంది.

'అతనెవరు?అతనెవరు?రమణకాదా?'

వెయ్యి లీటర్లశక్తి వచ్చినట్లు సీట్లో నుంచి లేచి గేట్లోకి పరుగెట్టాడు. మంచి నీళ్ల గ్లాస్‌లోకి తీసుకుని తన కంపార్ట్ మెంట్‌వైపు వెళ్తున్నాడు. అతను రమణ కాక ఇంకెవరు?

"రమణా!"

ఆ చిన్న ప్లాట్‌ఫారం ప్రతిధ్వనించిన ఆ కేకకు వెనక్కు తిరిగాడు రమణ. అతని కళ్ళు మెరిసాయి. అతని పెదాలు విచ్చుకున్నాయి. వేగంగా వెనక్కు తిరిగొచ్చి స్నేహితుడి చెయ్యిపట్టుకుని కంపార్ట్‌మెంటులో కెక్కాసాడు.

చాలా ఆనందంగా వుంది వాళ్ళిద్దరికీ. వాళ్ళిద్దరూ కలుసుకుని అప్పటికి సరిగ్గా పదేళ్ళు.

"రాధా! చాలా మారిపోయావ్."

"నువ్వూనూ" అని పేలవంగా నవ్వాడు రాధాకృష్ణ.

"ఎక్కడ నుండి ?" రమణవైపు స్నేహంగా చూస్తూ అడిగాడు.

"మా చిన్నోడికి సంబంధం చూడ వానికొచ్చి తిరిగొస్తున్నాను."

"కుదిరిందా ?"

"లేదు నచ్చలేదు."

ఆ సంభాషణ నిక పొడిగించలేదు రాధాకృష్ణ.

"పిల్లలు బాగున్నారా ? హేమంత్ కెంత మంది పిల్లలు ?"

"ఇద్దరు."

"రాఘవకు పెళ్ళి చేసారా ?"

"నీకు వ్రాసాను కదూ ! కానీ అనుకున్న డేట్ కంటే ముందుగా హఠాత్తుగా పెళ్ళిచేయాల్సి రావడంతో ఎవరికీ ఇన్విటేషన్స్ వేయలేదు." కాస్త మూసుకున్న తలుపును పూర్తిగా తెరుస్తూ సంజాయిషీ ఇచ్చాడు రాధాకృష్ణ. "పోనీలే మాధవ్‌రావ్ పెళ్ళికి నువ్వెలాగూ రాలేదు రాజేష్ పెళ్ళికి మాత్రం తప్పక రమ్మని రాయాలనుకుంటూ వున్నాను. నువ్వే కన్పించావు" సంతోషంగా అన్నాడు రమణ.

"నిజమే. ఏమిటో జీవితాల్లో పడి పోయాం. ఈసారి తప్పక వస్తాను."

చాల పొడిగా జరుగుతోంది సంభాషణ-తన మనసులో బాధ స్నేహితుడితో చెప్పుకుని తను చేసిన మహా తప్పును రమణ ముందు ఒప్పుకుంటేగాని రాధాకృష్ణ మనసులో ఆరాటం తీరేట్టు లేదు. రమణ కూడా ఏదో చెప్పబోయే ఆగిపోతున్నాడు.

"హేమంత్ రాఘవల ప్రాక్టీస్ బాగుందా ?" అడిగాడు రమణ. ఇక ఊరుకోలేదు రాధాకృష్ణ. హేమంత్ గురించి అంతా చెప్పేసుకున్నాడు.

"నువ్వన్నట్లు డబ్బులో ముంచి వాడ్ని చెడిపేసాను రమణా."

రైలు కొద్దిగా కదిలింది.

దిగబోయిన రమణను వారించాడు రాధాకృష్ణ.

"నేను టి. సి. తో మాట్లాడుతాను ఇక్కడే వుండిపో."

"నేను నెక్స్ట్ స్టేషనులో వస్తాను. మా ఆవిడ త్రీటైర్‌లో వుంది. కంగారు పడ్తుంటుంది" అనేసి పరుగెట్టాడు రమణ.

రమణ వెళ్ళిపోయాక మరల రాధాకృష్ణలో నిస్సత్తువ వ్యాపించింది. నీరసంగా తన సీట్లోకొచ్చి కూర్చొన్నాడు.

రమణకీ తనకీ మధ్య ఐదు సంవత్స రాలుగా ఉత్తరాలంతగా లేవు. ఇద్దరి దగ్గరా అడ్రసులు మాత్రం వున్నాయి. ఎప్పుడయినా ఇద్దరిలో ఒకరికి ఆవేశం వచ్చి "ఇది మరీ దారుణంరా మన మధ్య ఉత్తరాలు రాకపోవడం. నువ్వో మంచి ఉత్తరం వ్రాయి. ఆ స్టిము లేషన్‌తో నేనో పెద్దఉత్తరం వ్రాస్తాను" అని వ్రాస్తే అవతలి వ్యక్తికి స్టిము లేషన్ చచ్చిపోయేది. దాంతో వాళ్ళిద్దరి పర్సనల్ విషయాలు మరొకరికి తెలియ కుండా పోయాయి.

ఇప్పుడు తను రమణ ముందు దోషిలా తలవంచుకోవాలి. నేను చేస్తే విన్నావా? అని అతనంటే నిశ్శబ్దంగా ఆ అభియోగాన్ని తను అంగీకరించాలి. అలా అనుకున్నపుడు అతని శరీరంలో బరువు మరో టన్ను పెరిగింది. స్నేహి తుణ్ణి చాలా సంవత్సరాల తర్వాత కల్సు కున్నాననే ఆనందాన్ని అది క్రూరంగా చంపేస్తోంది.

అతనలా విచారపడ్తుండగానే భువన గిరి రావడం_ రమణ పరిగెట్టుకుంటూ వచ్చి తన కంపార్ట్‌మెంటులోకి ఎక్క యడం జరిగింది_ చిరునవ్వు బలవంతాన పెదాలమీద పులుముకుని జరిగి చోటి చ్చాడు రాధాకృష్ణ. రమణ అలసిపోయిన చిహ్నంగా ఆయాసపడ్తున్నాడు. ఇప్పుడు వాళ్ళ వయసు యాభై.

అలా స్నేహితుడి ప్రక్కనే కూర్చొన్న రాధాకృష్ణకి కొన్ని నిముషా లలో బరువు తగ్గినట్లయింది.

వచ్చాడే గాని రమణ ఏమీ మాట్లాడ లేదు. ఏదో ఆలోచిస్తున్నాడు.

"నువ్వనేవాడివి గుర్తుందా? నువ్వ యితే సంపాయిస్తున్నావు, ఖర్చు చేస్తు న్నావు వాళ్ళనలా పెంచకు. వాళ్ళు సంపాయిస్తారో లేదో మన కిప్పుడే తెలి యదు. అప్పుడు వాళ్ళు బాధ పడాల్సి వస్తుంది అని. అదే జరిగిందిరా. వాడు సంపాయించేది వాడికి చాలడం లేదు. కష్టపడి సంపాయించుకోవాల్సిన టైమ్‌ని, సుఖాలకి వెచ్చిచడంతో క్లయింట్స్ తగ్గిపోయారు. సంపాదన లేదు. దాంతో భార్యను వేధిస్తాడు డబ్బుకు."

ఈ సారీ రమణ మాట్లాడలేదు.

"ఒక రకంగా వాడు సాడిస్టుగా మారి పోయాడనిపిస్తుందిరా. వాడికి సంపాదన లేదు. భార్య ఇచ్చే డబ్బుతో సుఖాల్ని కొనుక్కోవాలి,సుఖాలుకావాలిగానీ భార్య అతన్ని చిన్నచూపు చూస్తుందేమోననే ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్.భార్య ఆస్తుల్ని నా ఆస్తుల్ని' వాడిపేర వ్రాయలేదని కోపం. ఆ కోపంలో వాడూ దగ్ధమయి మమల్ని కాలుస్తున్నాడు. తను తప్పులు చేస్తూ ఆ తప్పులు కప్పిపుచ్చుకోవనిటాకి ఎదుటి వ్యక్తుల్ని దోషులుగా చేసి ఆనంద పడ్తున్నాననుకునే తత్వంలో వున్నాడు. భార్య ప్రతి కదలికనూ విమర్శిస్తాడు. ఆలా అతని చుట్టూ మనుషులకు శాంతి లేకుండా చేస్తున్నాడు."




తనలోని ఆరాటం తగ్గేవరకు చెప్పేసి ఆపి నిశ్శబ్దంగా వున్న రమణ వైపు చూసాడు రాధాకృష్ణ. పాపం! నన్ను ఎలా ఓదార్చాలా అని ఆలోచిస్తున్నాడు అని స్నేహితునిమీద జాలిపడ్తూ గొణిగాడు.

"నువ్వు చెప్పిందే నిజంరా. పిల్లలకు తెలియని వయసులో ఎక్కువ డబ్బు ఇవ్వకూడదు."

నోరు విప్పాడు రమణ.

"ఊహుఁ నీ థియరీ, నా థియరీకూడా కరెక్ట్‌కాదని ఋజువుచేసారు రాధా మన పిల్లలు. నువ్వనేవాడివి గుర్తుందా? మన పిల్లల భవిష్యత్తును మనం నిర్మించగలమంటే నాకు నమ్మకంలేదని— దాని నిప్పుడు నేను నమ్ముతున్నాను" విచారంగా అన్నాడు రమణ.

"ఏమయ్యింది నీకు" ఆతృతగా అడిగాడు రాధాకృష్ణ.

"ఉండు వస్తాను" అని బాత్‌రూమ్‌కెళ్ళి వచ్చి టవలుతో చేతులు తుడుచుకుంటూ కూర్చొన్నాడు రమణ.

"క్రొత్తగా ఏమీ కాలేదు. మా మాధవ్ కూడా మీ హేమంత్‌లాగే వున్నాడు. కాకపోతే ఒక్కటే తేడా— భార్యడబ్బు వాడుకోడానికి అతని భార్యకంటూ స్వంతంగా డబ్బులేదంతే."

"మాధవ్ అలా తయారయ్యాడా? నేను నమ్మను" ధృడంగా అన్నాడు రాధాకృష్ణ.

"నమ్మి తీరాలి" విచారంగా నన్నాడు రమణ.

రాధాకృష్ణకు చలి అన్పించినట్టుంది. షాల్ తీసి కప్పుకున్నాడు. అతనికి యీమధ్య ఆరోగ్యం అంతంతమాత్రంగా వుంది.

"ఆరోగ్యం బాగాలేదా?" స్నేహితుని ప్రక్కనే వచ్చి కూర్చుంటూ అడిగాడు ఆర్ద్రంగా రమణ.

"నాకు బాగానే వుంది. నువ్వు చెప్పు మాధవ్ కేమయ్యింది."

తనలో తాననుకున్నంత మెల్లగా చెప్పాడు రమణ.

"నేను డబ్బు ఇవ్వక ఒక రకంగా వాడి కోరికల్ని కట్టేసాను. ఇప్పుడు సంపాదనాపరుడైన వాడు ఒక్కసారిగా సంకెళ్ళు త్రెంపుకుని ప్రతి సౌఖ్యాన్ని కొనుక్కుంటున్నాడు.

"దొరక్క దొరక్క అన్నం దొరికిన బిచ్చగాడిలా డబ్బుతో వచ్చే ప్రతి సుఖాన్నీ జుర్రుకుంటున్నాడు. అతను సంపాయించే ప్రతి పైసాని అతని సుఖానికి తప్ప భార్యకుకూడా ఖర్చుపెట్టడానికి ఇష్టపడడంలేదు."

స్నేహితుని కొడుకుకూడా చెడిపోయినందుకు బాధగానేవున్నా తన హేమంత చెడిపోయింది కేవలం తన పెంపకంవల్ల కాదనే ఓదార్పు రాధాకృష్ణకి కాస్త రిలీఫ్ నిచ్చింది.

"నేను చాలా పొరపాటు చేసాను రాధా! అతరకు వాడు ఉద్యోగాలకు అప్లై చేసేప్పుడు కూడా ఖర్చులకు తూచితూచి ఇచ్చేవాడిని-నా చిన్నప్పుడు మాఅమ్మ మా తమ్ముడికి వాడే పాలపిండి నాకు పెట్టేది కాదు. అప్పు డనుకునేవాణ్ణి నేను పెద్ద వాడినై సంపాయించి పది పాలపిండి డబ్బాలు కొనుక్కోవాలని, పదిడబ్బాలు నేను కొనుక్కోలేదు అది వేరే సంగతి. కానీ పెద్దాడుమాత్రం ఇలానే అనుకొనుంటాడు, నేను సంపాయించాక తనివితీరా ఖర్చుపెట్టాలని- అలాగే వాడు ఖర్చుపెట్టి ఆనందిసున్నాడు. వాడిలో నేను అణచిన కోరికలు ఇప్పుడు విజృంభింపాయిరా."

"బాదపడకు ఏం చేయగలం. రాజేష్కి ఉద్యోగం దొరికిందా?" అనునయంగా అడిగాడు రాధాకృష్ణ. అంతవరకు నీరసంగా బల్లవెనక్కువాలి కళ్లమూసుకుని చెప్తున్న రమణ కళ్లుతెరిచాడు.

"ఇద్దరికీ ఒకేసారి వచ్చాయి ఉద్యోగాలు. పెద్దాడు మునిసిపల్ స్కూల్లో టీచర్-వాడు మారలేదురా. ఇంతవరకు ఇలాటి వ్యామోహాలు వాడికి లేవు. వాడి సంపాదన కొంత ఇచ్చి మిగతాది బ్యాంకులో వేసుకుంటున్నాడు."

నిట్టూర్చాడు రాధాకృష్ణ.

"ఐతే ఎక్కడుంది లోపం? మనం మన ఇద్దరి పిల్లల్నీ ఒకేలా పెంచాం" వినీ వినిపించనట్టుగా గొణిగాడు.

కొద్ది క్షణాలు ఆలోచిస్తూ వుండిపోయాడు రమణ.

"రాధా! రాఘవ్, రాజేష్లాటి బాగుపడేవాళ్ళెప్పుడూ బాగుపడ్తారు, ఎలా పెంచినా. మాధవ్, హేమంత్ లాటి వాళ్ళను, వాళ్ళ మనస్తత్వాలనుబట్టి మనం పెంచాలి. నువ్వు అతిగా స్వేచ్ఛ నిచ్చావు- నేను అతిగా నిర్బంధించాను. అక్కడే మనం పొరపాటు చేసిందని పిస్తుందిరా. మనం మన ప్రిన్సిపిల్స్ను కాస్త వదులుచేసుకునుంటే వాళ్ళంతగా చెడిపోయుండేవాళ్ళు కాదేమో!"

నిట్టూర్చి మరలా సీట్ వెనక్కు వాలి కళ్ళుమూసుకున్నాదు రమణ. రాధాకృష్ణ మరల ఆలోచనల్లో పడిపోయాడు.